హాస్యకథ

# పెళ్లాం నవ్వింది

— గీతాసుబ్బారావ

అనగనగా ఓపల్లెటూరు. ఆ పల్లెటూరిలో మారుతీరావు అనే మోతుబరి రైతు ఉన్నాడు.

ఎర్రగా, నున్నగ ఉండే మారుతీరావుకి యాభై ఏళ్ళు దాటుతున్నాయి అంటే ఎవరూ నమ్మరు. మారుతీరావు కూడా ఇద్దరు ఆడపిల్లలకీ పెళ్ళిచేసి తాతయ్యా అని అనిపించుకున్నా.. తాతయ్యని అని అనుకోడు. ఇదే అమెరికాలో అయితే కరెక్టుగా పెళ్ళిచేసుకునే వయసు నాది! అంటూ వుంటాడు. మారుతీరావు మొదట్నుంచీ వందెకరాల ఆసామి కాబట్టి.. ఆ వూళ్ళో అతనికి ఎదురులేదు. రోజూ ఒకే రకం తిండి తినడం ఇష్టం లేనివాడే కాదు. సరసం తెలిసిన వాడు. సుఖపడటం తెలిసిన వాడు. సుఖం విషయంలో కులం, గోత్రం, ఆస్తి అంతస్తూ, చిన్నా, పెద్దా, పేదా, బిక్కా ఇలాంటి తేడాలు ఏవీ లేవు. మారుతీరావు ఊరిమీద తిరిగినంత మాత్రాన అతని భార్య అనాకారి అనుకోకూడదు. లక్షణంగా ఉంటుంది. పేరుకి అన్నపూర్ణ అయినా, భర్తని మంచి అదుపు ఆజ్ఞల్లో పెట్టింది. పగలంతా ఏ కొంపలంట తిరిగినా.... పొద్దుగూకే వేళకి భర్త ఇంటికి చేరాలి. రాత్రి అయ్యేసరికి భార్య పక్కనే పడుకొని తీరాలి. ఇది రాజశాసనం కాదు. రాణీ శాసనం. అందుకే మారుతీరావు ఏ సినిమాకి వెళ్ళినా మధ్యాహ్నం ఆటలూ... మ్యాట్నీ షోలే. ఫస్టు షో, సెకండు షో ఇంటి దగ్గరే!



ఆచారి మారుతీరావు చెవి దగ్గరగా వెళ్ళి 'పడుకోడానికి ఓ గంట ముందు పాలతో ఈ మందు వేసుకోండి. మళ్ళీ...మీ పెళ్ళి రోజు గుర్తొస్తుంది! రాత్రంతా... శివరాత్రే' అంటూ మెల్లిగా... ముసి ముసి నవ్వులతో చెప్పాడు.

ఆరోజు మారుతీరావు మనసు వికలంగా ఉంది. మడత కుర్చీల్లో పడుకుని అలా ఆలోచిస్తున్నాడు.... ఉదయం ధాన్యం బస్తా కావాలంటే గబగబా వెళ్ళి బయటకు తియ్యబోయాడు. అంతలో అన్నపూర్ణ గబగబా వచ్చి 'ఏమండీ! ఆ పని మీరు చెయ్యకండి!' అంది.

'ఏం?' అన్నాడు

'పాలేరు వస్తాడు కదా! తీస్తాడులెండి! ఇంకా కుర్రాణ్ణే అనుకుంటున్నారా?....' అని అదోరకంగా చూసి... ఫక్కున నవ్వి వెళ్ళిపోయింది.

ఆ నవ్వు మామూలుగా లేదు. వయసులో దుర్యోధనుడిని చూసి.... ద్రౌపది నవ్వినట్టుగా ఉంది!

చెట్టంత మొగాడ్ని పట్టుకుని పెళ్ళాం ఇంతమాట అన్నదీ అంటే... ఎంత అవమానం? ఆమెలో ఏదో అసంతృప్తి ఉందన్నమాట.

తనకిగాని... నరాల బలహీనత రాలేదుకదా. గదిలోకి వెళ్ళి అద్దంలో పదేపదే చూసుకున్నాడు. ఏమయినా ఓసారి.. సుత్తివేలాచారిని చూసిరావాలని అనుకున్నాడు.

సుత్తివేలాచారి అంటే ఆయనేమీ డాక్టర్ సమరంగారి లాంటివాడు కాదు. ఆ వూరికి ఈ మధ్యనే వచ్చిన ఆయుర్వేద వైద్యుడు. కొందరు చెప్పుకోవడం ఆయుర్వేద వైద్యంలో ఆచారి చాలా గొప్పవాడనీ.. ఆవూరికి దగ్గరగా వున్న అడవులలో మంచి మంచి మూలికలు దొరుకుతాయని తెలిసి వచ్చాడనీ చెప్తూ ఉంటారు. అది నిజమే అనిపిస్తుంది. ఎందుకంటే ఆచారి రోజూ.. ఆ అడవుల్లోకి పోయి ఏవో చెట్ల వేళ్ళు తెస్తూనే వుంటాడు. ఎంత సేపూ ఆ అడవులంట తిరగటం లేదా, ఏవో మందులు

నూరుకోవడం తప్ప మరో వ్యాపకం లేదు అతనికి. ఎవరికి ఏ రోగం వచ్చినా అడిగితే కాదనకుండా మందులు ఇస్తూ ఉంటాడు. అదే విధంగా మారుతీరావుకి కూడా రెండు మూడుసార్లు ఏవో మందులు ఇవ్వడం జరిగింది.

ఆచారి ఎంత నల్లగా వుంటాడో అతని భార్య శ్రీలక్ష్మి అంత తెల్లగా వుంటుంది. జాం పండులా... పిట పిటలాడే ఆ అమ్మాయిని ఈ నల్లకాకికి ఇచ్చారా అని అందరికీ ఆశ్చర్యమే. కానీ దానికీ కారణముంది. ఆ పిల్లకి అక్షరం ముక్కరాదు. దానికితోడు అమాయకురాలు. వెర్రి బాగుల్ది.

మారుతీరావు... తెల్ల సిల్కు చొక్కా తెల్లపంచతో... పట్టుకండువా వేసుకుని కిర్రు చెప్పులతో హుందాగా ఆచారిగారి ఇంటికి చేరుకున్నాడు.

శ్రీలక్ష్మి తలనిండా పూలు పెట్టుకుని గుమ్మంలో నుంచుని వీధివంక చూస్తోంది.

'ఏమయ్యా ఆచారీ! ఈ మధ్య మాఇంటివైపే రావడం మానేశావ్?' అంటూ శ్రీలక్ష్మిమీదో చూపు విసిరి...ఎదురుగా అరుగుమీద కూర్చొన్నాడు. మారుతీరావు.

'అయ్యా! మీరా! కుర్చీ తెప్పిస్తా వుండండి' అన్నాడు ఆచారి.

'వద్దయ్యా! ఇక్కడే హాయిగా ఉంది. నీ పనికానివ్వు!!'

'అయినా కాకితో కబురు చేస్తే నేనే వచ్చేవాణ్ణికదా!'

'నిజమే అనుకో! వయసుకి కాస్త గౌరవం ఇవ్వాలిగా! అందుకే వచ్చేశా!' అంటూ మళ్ళీ శ్రీలక్ష్మి మీదకి మరోచూపు విసిరాడు మారుతీరావు.

'ఏమేవ్! ఇలా నిలబడకపోతే కాస్త మజ్జిగ తెచ్చి ఇవ్వవచ్చు కదా!' అన్నాడు ఆచారి.

అంతలో శ్రీలక్ష్మి 'పోనీ! పాలు ఇవ్వమంటారా?' అని అడిగింది.

'ఛీ! నేచెప్పినది చెయ్యి! ఫో! మజ్జిగ తీసుకురా!' అని విసుక్కున్నాడు ఆచారి!

'కోప్పడకండి! చిన్నపిల్ల...' అన్నాడు మారుతీరావు

'నాబొంద! అది చూడటానికే అలా ఉంటుంది. కంటే... ఈపాటికి పదిమంది పుట్టేవారు....! ఇంతకీ తమరొచ్చిన పని చెప్పారుకాదు!' అన్నాడు ఆచారి. మారుతీరావు ఆచారి దగ్గరకొచ్చి మెల్లగా అన్నాడు.

'మీ దగ్గర ఊరపిచ్చుక లేహ్యం దొరుకుతుందా? అంతలో మజ్జిగ గ్లాసుతో వచ్చిన శ్రీలక్ష్మి 'ఊరపిచ్చుకలు మాఇంట్లో చాలావున్నాయి. ఇంటినిండా గూళ్ళు కట్టాయి. ఒకటి పట్టి... ఇవ్వమంటారా' అని అడిగింది.

'ఛీ! ఛీ! ఛీ! లోపలికి వెళ్ళు!' అని విసుక్కున్నాడు ఆచారి.

గదంతా అగరొత్తుల వాసన వెదజల్లుతోంది. మంచం మీద పెళ్ళికొడుకులా కూర్చొని... మల్లెపూలు పక్కనిండా జల్లుతూ ఆచారి ఇచ్చిన మందు మహత్యాన్ని తలుచుకుంటూ భార్యకోసం ఎదురు చూస్తున్నాడు మారుతీరావు.




'అయ్యా! ఊరపిచ్చుక లేహ్యం లేదుకాని ఊరగ్రగద్ద చూర్ణం వుంది! ఇవ్వమంటారా!'

'మీరుఇస్తానంటే నేను వద్దంటానా?'

'ఇది కూడా బాగా పనిచేస్తుంది'

'భలేవారే! మీరిచ్చే మందుమీద నాకు నమ్మకంఉంది...' అన్నాడు మారుతీరావు.

'ఇదిగో నిన్నే! లోపల నా అల్మారాలో పాడుగుసీసాలోధ్వజస్తంభ చూర్ణం ఉంటుంది. రెండు చెంచాలు చొప్పున రెండు పొట్లాలు కట్టి తీసుకురా!' అని చెప్పాడు.

'అయ్యా! తాత్కాలికంగా ఈ చూర్ణం వాడండి! రెండ్రోజుల్లో ఊరపిచ్చుక లేహ్యం చేసి... ఇస్తాను!'

'ప్రస్తుతానికి ఇది ఉంచండి!'
అంటూ మళ్ళీ ఓచూపు... శ్రీలక్ష్మిమీదకు విసిరాడు.

ఆచారి మారుతీరావు చెవి దగ్గరగా వెళ్ళి పడుకోడానికోఓ గంటముందు పాలతో ఈ మందు వేసుకోండి! మళ్ళీ.... మీ పెళ్ళిరోజు గుర్తొస్తుంది! రాత్రి అంతా... శివరాత్రే' అంటూ మెల్లగా ముసిముసి నవ్వులతో చెప్పి... ఇరవై కాయితం బొడ్డులో దోపుకున్నాడు.

గువ్వలు గూటికి చేరుతుండగా... మల్లెపూల పొట్లం, బందరు మిఠాయి పొట్లం పుచ్చుకుని హుషారుగా ఇంటికి చేరుకున్నాడు మారుతీరావు.

'పూర్ణం! అన్నపూర్ణా!!'

'ఏమయిందీ? వస్తున్నా!!' అంటూ పరుగెత్తుకు వచ్చింది అన్నపూర్ణ.

సామాన్యంగా భర్త అంత హుషారుగా రావడం ఆమెకి తెలీదు.ఎప్పుడూ.... మెల్లగా.... నీరసంగా వచ్చి.... కుర్చీలో కూలబడే భర్త...హుషారుగా రావడం చూసి ఆశ్చర్యపోయింది!

ఏమేవ్... అని అరిచే భర్త.... పేరు పెట్టి పిలవడం విని.... కంగారు పడింది!

'ఇదిగో.....' అంటూ పొట్లాలు అందించాడు!

'అమ్మాయికా?'

'ఛీ! అమ్మాయికి నేనెందుకు తెస్తాను. దానిమొగుడు దానికి తెస్తాడు! వెళ్ళు వెళ్ళు! వెళ్ళి ఓ గ్లాసుపాలు తీసుకురా!' అన్నాడు మారుతీరావు తనగదిలోకి వెళ్తూ—

అన్నపూర్ణ పాలు తెచ్చిఇచ్చింది. ఆ పాలలో ఓ పొట్లం చూర్ణం కలిపి... గడగడా తాగేశాడు.

'ఏం వంట్లో బాగాలేదా?' అడిగింది.

'ఛీ! నేనేం ముసలాణ్ణి అనుకున్నావా? వెళ్ళు... బాత్ రూంలో నాకు నీళ్ళు పెట్టి.... ఈ పక్కమీద దుప్పటి మార్చి... కాసిన్ని మల్లెపూలు జల్లి.... గదిలో నాలుగు అగర్ బత్తీలు వెలిగించి పెట్టు...!' అంటూ చెప్పుకు పోతున్న భర్త ధోరణి చూసి—

'మీకేమైనా పిచ్చి పట్టిందా?' అని అడిగింది.

'ఏం... నేను నీకంటికి పిచ్చివాడిలా కనిపిస్తున్నానా?' అంటూఉండగానే అన్నపూర్ణ వెళ్ళిపోయింది.

○ ○ ○

గదంతా అగరొత్తులవాసన వెదజల్లుతోంది. మంచం మీద పెళ్ళి కొడుకులా కూర్చొని... మల్లెపూలు పక్కనిండా చల్లుతూ... 'ఆహా ధ్వజస్తంభ చూర్ణం.... ఓహో...' అంటూ కూనిరాగాలు తీస్తున్నాడు మారుతీరావు—అన్నపూర్ణ ఎంతకీ రాకపోయేసరికి.....

'ఏమేవ్!' అని అరిచాడు.

అన్నపూర్ణ గబగబా వచ్చింది.

గదిలోవాతావరణం చూసి—

'ఛీఛీ!వయసు పెరిగేకొద్దీ మీ బుద్ధి బురదలోకి లాగుతోంది!'

'వయసు పెరిగిందో.... తగ్గిందో.... చూపిస్తా! త్వరగారా!'

'కాస్త అరవకండి! ఇంట్లో... అల్లుడూ... కూతురు వున్నారనే మాట మర్చిపోయారా?'

'అయితే త్వరగా రా!'

'వస్తాను! మీ సంగతేమిటో నేనూ చూస్తాను!' అంటూ కొంటెగా ఓ... నవ్వు నవ్వేసి వెళ్ళిపోయింది.

ఓ గంటలో పనులన్నీ పూర్తిచేసుకుని 'ఫ్రిజ్ లోని మంచినీళ్ళ సీసాతో గదిలోకి అడుగుపెట్టింది అన్నపూర్ణ.

అన్నపూర్ణని చూసీ చూడగానే.... గభాలున కౌగలించుకుని ఎత్తుకోబోయాడు—'లాభం లేదు' అంటూ—

మంచం దగ్గరకు తీసుకు వెళ్ళాడు.



ఇద్దరు మంచంమీద పడుకున్నారు. భార్యమీద మెల్లగా చెయ్యి వేశాడు. దగ్గరగా తీసుకోబోయి... ఏదో షాక్ కొట్టినట్టు చెయ్యి తీసేసాడు. పొట్టలో ఏదో శబ్దం వచ్చింది. పొట్టమీద చెయ్యివేసి చూసుకున్నాడు. పొట్టలో ఏదో... గుడగుడమంటోంది.

మందు పనిచెయ్యడం ప్రారంభించినట్టు ఉంది! అన్నపూర్ణా! నిద్రపోవద్దు! బాత్ రూంలోకి వెళ్ళి క్షణంలో వచ్చేస్తా....!'అంటూ బాత్ రూంలోకి దూరాడు మారుతీరావు.

○ ○

ఇక్కడ సుత్తిఆచారి ఇంట్లో... ఆచారి తన భార్య శ్రీలక్ష్మిమీద చిందులు వేస్తున్నాడు.

'ఖర్మ! నీకు చదువురాదనే సంగతి నేను మర్చిపోతూనే వుంటాను! నువ్వు గుర్తు చెయ్యవచ్చుగదా! ధ్వజస్థంభ చూర్ణం ఏదో తెలియడం లేదు అని నన్ను అడగవచ్చుగదా!'

'పొడుగు సీసా అన్నారుగా!

'సీసా పొడుగ్గా ఉందని.... పేరు చూసుకోకుండా ఇచ్చేయడమేనా? అని ధ్వజస్థంభ చూర్ణం కాదు! పంచబాణ చూర్ణం! విరేచనాల మందు! అది చిటికెడు వేసుకుంటే సరిపోతుంది! నువ్వేమో రెండు చెంచాలుఇచ్చావు! అక్కడ ఆయనగారికి ఏమవుతోందో.... ఏమో...'

'రెండు చెంచాలు కాదండీ!' ఊళ్ళో పెద్దమనిషికదా... అందుకని.... మూడు చెంచాలు వేసి పొట్లం కట్టేను.....'

'అయ్యబాబోయ్! ఇక సంచీ దులిపినట్టే... ఆగకుండా విరేచనాలు అయిపోతాయి! రేపు తెల్లారేకా... ఆ మారుతీరావుగారు నా ప్రాణం తీసేస్తాడు బాబోయ్.....'

'ఎందుకండీ అంత భయపడతారు? ఈ వూరు కాకపోతే మరోవూరు వెళ్దాం! లేవండి భోజనానికి! గుత్తివంకాయ కూర చేశాను.....' అంటూ వంటగదిలోకి వెళ్ళిపోయింది

'గుత్తివంకాయ కాదు.... నా తలకాయ కూర వండకపోయావా? ఖర్మ.....' అంటూ తలబాదుకున్నాడు ఆచారి.

○ ○ ○

ఇక్కడ మారుతీరావు నీరసంగా మంచం దగ్గరకు వచ్చాడు.

'అబ్బా! ఏమిటండీ.... రాత్రి నిద్రపోకుండా.. నా ప్రాణం ఇలా తీస్తున్నారు? వస్తే త్వరగా రండి! లేకపోతే నేను నిద్ర పోతాను...' అని విసుక్కుంది అన్నపూర్ణ.


'వచ్చేశాగా!' అంటూ మారుతీరావు మంచం ఎక్కబోయాడు—మళ్ళీ కడుపులో గుడగుడ... గడబిడ!!

'పూర్ణా! క్షణంలో వచ్చేస్తా! నిద్ర పోవద్దు! నువ్వు నిద్రపోతే.... మరీ కుంభకర్ణుడి చెల్లెలులా నిద్రపోతావు!'' అంటూ మారుతీరావు బాత్ రూంలోకి వెళ్ళాడు.

అన్నపూర్ణ లేచి లైటువేసి గడియారం చూసింది. పదకొండు గంటలు దాటింది.

'ఏమండీ! మిమ్మల్నే! పదకొండు దాటింది' అంది అన్నపూర్ణ.

సమాధానం రాలేదు. మంచందిగి... బాత్ రూం తలుపుతట్టింది.



'ఏమండీ వస్తున్నారా లేదా!'

'ఇకరాలేమ! నేను ఇక్కడే... ఏడుస్తాగాని.... నువ్వు నిద్రపో...' అంటూ నీరసంగా మూలిగాడు మారుతీరావు—

మారుతీరావు.... రాత్రివచ్చాడో... తెల్లవారుజామున వచ్చాడో... పాపం... మధ్యాహ్నం ఒంటిగంట వరకు లేవలేదు.

సాయంత్రానికి కాస్త నీరసం తగ్గేక ఈ ఆవారిగాడి సంగతి తేల్చాలి అనుకుంటూ మెల్లగా ఆవారి ఇంటికి చేరుకున్నాడు.

తలుపుకొట్టేడు.

శ్రీలక్ష్మి తలుపుతీసి మారుతీరావుని చూసి... 'మీరా?' అంది.

శ్రీలక్ష్మిని చూసీచూడగానే మారుతీరావుకోపం గాలికి ఎగిరిపోయింది.

'నన్ను క్షమించండి! పొరపాటున విరేచనాల మందు ఇచ్చాను...'

'ఫర్వాలేదు!' అంటూ అరుగుమీద కూర్చున్నాడు మారుతీరావు.

'మీరు మావారిని ఏమీ అనకండి! ఆయన రాత్రంతా భయపడుతూనే ఉన్నారు! తప్పుచేసింది నేను కదా!'

'మీ వారిని ఏమీ అనను! ఒక్కసారి బయటకు రమ్మను!'

'వారు ఇంట్లో లేరు! ఏవో మూలికలు కావాలని... అడవిలోకి వెళ్ళారు!..అంది శ్రీలక్ష్మి.

ఆవారి ఇంట్లో లేడు అనగానే లాటరీ వచ్చిందన్నట్టుగా ఆనందపడి పోయాడు మారుతీరావు గభాలున లేవబోయాడు! నీరసం! ఛా! బంగారంలాంటి ఛాన్సు పోయింది. అని తనని తానే తిట్టుకున్నాడు. పోన్లే... కాస్సేపు కబుర్లు చెబుదాం అనుకుని—

'నువ్వు కూడా అలాకూర్చో!' అన్నాడు—

శ్రీలక్ష్మి గుమ్మంలో కూర్చుంది.

'ఏమిటీ చెప్పండి! మజ్జిగ కావాలా? పాలుకావాలా? మంచినీళ్ళు కావాలా?' అని అడిగింది.


'నువ్వే కావాలి....' అని మనసులోనే అనుకుని 'ఏమిటో భగవంతుడి లీలలు ఎవరికీ అర్థం కావు...' అన్నాడు.

'ఈ ఊరికి ఇప్పుడు వచ్చింది ఆ సినిమా!' అంది శ్రీలక్ష్మి—

'సినిమా గురించి నేను మాట్లాడ్డం లేదు. జీవితం గురించి! అంటే.... నీ గురించి....' అన్నాడు మారుతీరావు—

'నా గురించి... చెప్తారా? చెప్పండి!' కాస్త ముందుగా జరిగింది శ్రీలక్ష్మి.


ఇక విషయంలోకి రావచ్చునమకున్నాడు మారుతీరావు—




'నువ్వు బంగారంలా ఉంటావు! నిన్ను ఈ ముసలాడికి ఎలా కట్టబెట్టారు... మీవాళ్ళు?'

'భలేవారే! మావారు ముసలాళ్ళ అనుకుంటున్నారా! చూడ్డానికి అలా కనిపిస్తారు. ఇంట్లో... చాలా హుషారుగా ఉంటారు.'

హుషారు అనే మాటకు మరోరకంగా అర్థం చేసుకున్నాడు మారుతీ రావు. తొందరగానే లైన్‌లోకి వచ్చేసింది అనుకున్నాడు...



'అంత హుషారా?.....'

'అవునండీ! బావిలో నీళ్ళు ఆయనే తోడుకుంటారు! మొక్కలకి... ఇంట్లోకి అన్నీ ఆయనే తోడతారు. బట్టలన్నీ ఆయనే ఉతుకుతారు! నా చీరలు కూడా....'

'అదిసరే! ఇంట్లో పనులు అందరూ చేస్తారు! రాత్రివేళ... ఏం చేస్తారు?'

'అమ్మో! రాత్రి పన్నెండు, ఒంటిగంట వరకు నిద్రపోరు!' అంది శ్రీలక్ష్మి.

'అంత హుషారుగా వుంటారా?' తన ధోరణిలోనే అర్థం చేసుకుని ఆ ధోరణిలోనే అడిగాడు..

'అవునండీ! రాత్రి ఆయనకి బద్ధకం ఉండదు నాకు నిద్ర వస్తోంది అంటే... తిడతారు! ఆ...!'

'అంత హుషారుగా ఉంటారంటే... ఆవారిగారు ఏదో మందు వాడుతూ ఉండాలి! అవునా?' అడిగాడు మారుతీరావు—

'అవునండీ! రోజూ రాత్రివేళ ఆ మందు కాస్త... పాలలో వేసుకుని మింగుతూ వుంటారు. అయినా మీకెలా తెలిసింది? జ్యోతిష్యం వచ్చా?'

'కాస్త తెలుసుకానీ.... ఆ మందు ఏమిటో... ఎక్కడ ఉందో నీకు తెలుసా?'

'నాకెందుకు తెలీదు! అదికొత్తగా తయారు చేస్తున్నారు. చాలాగొప్పది... అన్నారు'

'అలాగా! అయితే... ఆ మందు నాకు ఇస్తావా?'

'అమ్మో! మా వారికి తెలీకుండా ఇస్తే ఆయన తిడతారేమో!!'

'నేను వచ్చి అడిగితే ఇచ్చాను అని చెప్పు! నా పేరు చెబితే ఏమీ అనరు! ఈ యాభై రూపాయలు కూడా ఆయనకు ఇవ్వు!!' అన్నాడు మారుతీరావు.

'యాభై కాయితం చూడగానే శ్రీలక్ష్మి ఇక కాదనలేక పోయింది. గబగబా లోపలికి వెళ్ళి రెండు పొట్లాలు కట్టి ఇచ్చింది.

'అమ్మో! ఇది మళ్ళీ విరేచనాల మందు కాదుకదా!' భయంగానే అడిగాడు.

'భలేవారండీ! ఓసారి పొరపాటు జరిగింది. ఎప్పుడూ పొరపాట్లు చేస్తామా?'

'నిజమే! నిజమే! వస్తానమ్మా! ఆవారిగారు వస్తే వచ్చి వెళ్ళానని చెప్పు! అంటూ మారుతీరావు ఇంటికి వెళ్ళి పోయాడు.

ㅇ ㅇ ㅇ

హాయిగా కాలుమీద కాలువేసుకుని మారుతీరావు పట్టులుంగీతో పెళ్ళికొడుకులాగా మంచం మీద కూర్చున్నాడు. పక్కనిండా పూలు. గది అంతా సెంటు వాసనతోగుమ్మెక్కిస్తోంది.

'ఏమండీ... భోజనం చేస్తారా? ఫలహారం చేస్తారా?.....' అని అడుగుతూ గదిలోకి వచ్చిన

అన్నపూర్ణ... గదిలో హంగామా చూసి అదిరి పోయింది.

'హయ్యోరాత! ఆ మాయదారి రోగం రాత్రితో పోయింది అనుకున్నాను! మళ్ళీ వచ్చిందా?.....' అంది.

'మాట్లాడకు! అసలు రాత్రి ఇప్పుడే ఉంది... త్వరగా రా!'

'భోజనం చెయ్యరా?'

'భోజనం ఎందుకే?... జీడిపప్పు మిఠాయి తెచ్చానుగదా! రా...'

'ఏమిటో... మీ వాలకం చూస్తే... మిఠాయి బదులు నన్నే తినేసేలా ఉన్నారే....''

'ఆలస్యం చెయ్యకు! అంతపనీ చేస్తాను! అల్లుడూ, అమ్మాయికూడా లేరుగా! నన్ను ఆపే వాళ్లే లేరు! త్వరగా!! మందుపవర్ తగ్గి పోతుంది...'

'ఓరినాయనో... మళ్ళీ ఏదయినా మందు మింగారా... ఏమిటీ ?'

'కంగారు పడకు... బాత్‌రూమ్‌లోకి వెళ్ళనులే... రా...' అంటూ అన్నపూర్ణని మంచం దగ్గరకు తీసుకు పోయాడు.

'ఆహా... నీలో అందాలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి ఏమిటే? రామ రామ నీ ముఖం శ్రీదేవి ముఖంలా ఉంటోంది!'

**'అవును! రాత్రిపూట ప్రతిమగాడికీ భార్యముఖం శ్రీదేవి ముఖంలాగే కనిపిస్తుంది. తెల్లారిన తర్వాత దెయ్యంలాగా... భూతంలాగా కనిపిస్తుంది!!'**

అబ్బా నా మూడ్ చెడగొట్టకు! రా... దగ్గరకు రా!' అంటూ రెండు చేతుల్తో పట్టుకోబోయాడు. వీధి తలుపులు దబదబా కొట్టారు ఎవరో—

'అర్థరాత్రి మద్దెల దరువు అంటే ఇదే కాబోలు' అన్నాడు మారుతీరావు.

'చూసిరానా?' అని అడిగింది అన్నపూర్ణ.

'ఛీ! ఇలా వెళ్తావా? నువ్వు లేవకు! నేనే వెళ్లి చూసి వస్తాను' అంటూ మారుతీరావు... వెళ్ళి తలుపుతీశాడు.

ఎదురుగా పాలేరు పానకాలు నిలబడి ఉన్నాడు—

'ఏరా! మా ఇంటికి రావడానికీ...తలుపు కొట్టడానికి.. వేళాపాళా లేదా? ఏం కావాలి?' గదమాయించాడు.

'అరవకండి బాబూ! మన ఆచారిగారు అర్జంటుగా వెళ్ళమంటేనే వచ్చాను' అన్నాడు పాలేరు రహస్యంగా.

'నీ దుంపతెగా! మళ్ళీ ఏం జరిగిందిరా?'

## వెర్రెక్కిస్తున్న 'బోడెరెక్'



*పదుముగుండెల గిలిగింత బోడెరెక్ మళ్లీ ప్రేక్షకులను ఆమె ఆరాధకులను కలల కౌగిళ్లల్లో తేలించడానికి వస్తోంది. 'టెన్' చిత్రంలో వయసుతో పనిలేకుండా అందరినీ వెర్రెక్కించిన బోడెరెక్ 1984 తర్వాత చిత్రాల్లో దర్శనం ఇవ్వలేదు. ఆమె బొలెరో చిత్రం తర్వాత మరి కనిపించలేదు. ఇన్నాళ్లు దాగుడుమూతలు ఆడిన బోడెరెక్ ఆట చాలించి 'ఘోస్ట్స్ కెనాట్ డు' అనే చిత్రంలో అందరికీ కన్నుల విందు చేస్తుందట. ఈ చిత్రంలో 31 సంవత్సరాల బోడెరెక్ భర్త మరణిస్తాడు. అతగాడు ఆత్మ రూపంలో భార్య దగ్గరికి తిరిగి వస్తాడు. భార్యకు మాత్రమే కనిపిస్తాడు. అతడు భార్య సాయంతో ఓ యువకుడి శరీరాన్ని ఆక్రమించి భార్యతో కలిసి జీవించడానికి చేసే ప్రయత్నమే ఈ చిత్రకథ. బోడెరెక్ లాంటి అందగత్తె కనిపిస్తే శవమైనా లేచి కూర్చుంటుంది. ఇక భార్యగా లభిస్తే చనిపోయి బ్రతకాలను కోవడంలో విచిత్రం ఏముంటుంది?*

'తెలవదండి! ఈ ఉత్తరం మీకు ఇచ్చెయ్యమన్నారు! అర్థరాత్రిఅయినా ఫర్వాలేదు. అతిరహస్యం... అని చెప్పారండీ!'

'సరే సరే! ఆ ఉత్తరం ఇలా ఇచ్చి నువ్వు వెళ్లు!' అంటూ చేతిలో ఉన్న ఉత్తరం తీసుకుని గభాలున తలుపు మూసేశాడు.

గబగబా లోపలికి వచ్చి—

'పూర్ణాన్నిద్రపోకు! వచ్చేస్తా....' అంటూ టేబిల్ లైట్ వేసి ఉత్తరం తీసి చూశాడు—

మహారాజశ్రీ గౌరవనీయులైన శ్రీ మారుతీరావు గారికి తమ విధేయుడు సత్తివేలాచారి నమస్కరించి వ్రాయునది. అయ్యా! నేను ఇంట్లో లేని సమయంలో మీరు మాఇంటికి వచ్చి మా ఆవిణ్ణి అడిగి తీసుకున్న మందు ఎంతమాత్రం వాడ వద్దు. అది కామప్రక్షాళన మార్గం! కామం ప్రకోపించిన వారికోసం, మిలిటరీలో ఉన్న జవానులకోసమూ, నర్సులకోసమున్నూ తయారుచేసింది! అది చిటికెడు పాలల్లో వేసుకుని తాగితే వంట్లోని కామగుణం వచ్చిపోయి, ఏడాదివరకు మగతనం అనేది లేకుండా పోతుంది. అందుచేత మీరు ఆ మందు ఎట్టి పరిస్థితిలోనూ వాడవద్దు! ప్రస్తుతం ఆ మందుకి విరుగుడు తయారు చేస్తూ ఉండగా మా వెర్రి బాగులది చూసి... ఏదో అనుకుంది! నేను ఈ రాత్రికి ఊరు వదిలి వెళ్ళిపోతున్నాను. కారణం మీరు మరోసారి మా ఇంటికి వచ్చి ఇంకేదయినా తీసుకుపోతారని భయం! మా వెర్రి బాగుల్ది... ఇంకేదయినా ఇచ్చినా ఇవ్వవచ్చు! బ్రతికిఉంటే బలుసులాకు తిని బతకవచ్చు! సెలవు.

ఇట్లు—మీ వేలాచారి—

ఉత్తరం చదివిన మారుతీరావు... ఒక్క గావుకేక పెట్టాడు.

అన్నపూర్ణ ఉలిక్కిపడి పరిగెత్తుకుంటూ వచ్చింది.

'ఏమయిందండీ?'

'పోయింది!'

'ఏం పోయిందీ? పంట పోయిందా?'

'అంతకంటే ముఖ్యమైనదే పోయింది! అసలు వస్తువే పోయింది!!'

అన్నపూర్ణకి ఏం అర్థం కాలేదు!

'ఎవరినైనా పిలవమంటారా? పోలీసు రిపోర్టు ఇద్దామా?'

'వద్దు! అంతపని చెయ్యకు! పరువుకూడా పోతుంది.'

మారుతీరావు... దీనంగా... అన్నపూర్ణని చూశాడు.

'నీకు అన్యాయం చేశాను' అన్నాడు.

'ఏమయిందో చెప్పరాదా?'

'చెవిలో చెప్తాను! ఇలారా'! అన్నాడు

జరిగింది.. చెవిలో చెప్పాడు!

అన్నపూర్ణ మళ్ళీ ఫక్కున నవ్వింది!

అదేనవ్వు! మయసభలో పాంచాలి నవ్విన నవ్వు!

మారుతీరావు ఆ నవ్వుకి విలవిలలాడి పోయాడు

—మనవి—

పాత్రలగురించి సులువుగా అర్థం కావడంకోసం సినిమా తారల పేర్లు వాడాను. మరోలా అర్థం చేసుకోవద్దని మనవి.

—గీతా